క్లుప్తంగా

సిద్ధిధాత్రిదేవిగా శ్రీదేవి అమ్మవారు



సిద్ధిధాత్రి దేవిగా దర్శనమిస్తున్న అమలాపురం శ్రీదేవి అమ్మవారు

అమలాపురం టౌన్: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా అమలాపురం శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారు సోమవారం సిద్ధిధాత్రిదేవిగా అలంకృతమై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నెల 16న పట్టణంలో అమ్మవారి నిమజ్జన ఊరేగింపును భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు తెలిపారు.

ఘనంగా ధమ్మ దీక్షా దినోత్సవం



తాళ్లరేవు ధమ్మ దీక్షా దినోత్సవంలో మాట్లాడుతున్న బౌద్ధ ఉపాసకులు

తాళ్లరేవు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ ధమ్మ దీక్షా దినోత్సవాన్ని సోమవారం తాళ్లరేవులో ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా తాళ్లరేవు మండల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తొలుత బుద్ధ వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పి.నాగేంద్రరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అంబేడ్కర్ ధమ్మ దీక్ష స్వీకరణ, బౌద్ధ ధర్మ సిద్ధాంతాలను పి.నరసింహమూర్తి మాస్టారు, పంతగడ రాంప్రసాద్, పి.సుధీర్ వివరించారు. కార్యక్రమంలో జక్కల ప్రసాద్, మోర్త భైరవమూర్తి, కోరుకొండ నాగేశ్వరరావు, గిడ్ల వీరప్రసాద్, టి.ఈశ్వరరావు, కమిడి ఈశ్వరీబాయి పాల్గొన్నారు.

గణపతి ఆలయం ప్రారంభం

అమలాపురం టౌన్: స్థానిక దుడ్డివారి అగ్రహారంలో బాల విద్యా గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు నిర్మించిన గణపతి ఆలయాన్ని రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ఉదయం ప్రారంభించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు యల్లమిల్లి నాగ సుధా కొండ, మంగళంపల్లి ప్రదీప్, కొత్తపల్లి వంశీ, వైఎస్సార్ సీపీ నాయకులు మంగళంపల్లి అంజిబాబు, గోపి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆశయాల సాధనకు కృషి చేయాలి

తాళ్లరేవు: పౌరహక్కుల నేత ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా ఆశయాల సాధనకు కృషి చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. సోమవారం స్థానిక ప్రజా సంఘాల భవనంలో సాయిబాబా సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు వల్లు రాజబాబు, చల్లా సంతోష్‌కుమార్, యానిమేటర్లు పాల్గొన్నారు.

త్రయంబకేశ్వరుడికి అభిషేకాలు



త్రయంబకేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న మంత్రి సుభాష్

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక గ్రామంలో వేంచేసిఉన్న భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయాన్ని రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం ట్రస్టీ మాజీ సభ్యుడు చింతా శంకరమూర్తి, సర్పంచ్ పెనుమాల సునీత, పిచ్చిక శ్యామ్ పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం మండలంలో పల్లె పండుగ



మునిపల్లిలో సీసీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

ఉప్పలగుప్తం: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎస్.కొత్తపల్లి, వానపల్లిపాలెం, పెదగాడవిల్లి, చినగాడవిల్లి, మునిపల్లి, ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, సన్నవిల్లి గ్రామాల్లో ఎమ్‌జీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్వహించే పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సోమవారం శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కుంచే చిట్టికుమారి, కడిమి చిన్నవరాజు, యర్రంశెట్టి రామచంద్రరావు, బద్రి బాబ్జి, జొన్నాడ శ్రీదుర్గ, చిక్కం జంగమయ్య, ఎంపీటీసీ సభ్యుడు నిమ్మకాయల స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలెక్కని ప్రతిపాదనలు

- నిర్లక్ష్యానికి గురైన గోపాయిలంక అవుట్ ఫాల్ స్లూయిజ్
- మరమ్మతులకు నోచుకోని షట్టర్లు
- కలగా మిగిలిన కొత్త షట్టర్ల ఏర్పాటు



గోపాయిలంక వద్ద మరమ్మతులకు నోచుకోక పాడైన అవుట్‌ఫాల్ స్లూయిజ్ షట్టర్లు



ఆటోమెటిక్ షట్టర్లు పాడవ్వడంతో కుమ్మరికాలువలోకి ఎదురెక్కుతున్న వరద నీరు

అల్లవరం: అమలాపురం, అయినవిల్లి, అల్లవరం మండలాల్లోని వేలాది ఎకరాల్లోని ముంపు నీరు, అమలాపురం పట్టణ ప్రాంతంలోని డ్రైనేజీ నీరు కుమ్మరికాలువ ద్వారా దిగువకు ప్రవహించి గోపాయిలంక వద్ద అవుట్ ఫాల్ స్లూయిజ్ గుండా వైనతేయ నదిలో కలుస్తుంది. 2003లో నిర్మించిన ఈ అవుట్‌ఫాల్ స్లూయిజ్‌కు కుమ్మరికాలువలోకి వచ్చిన ముంపు నీటి లెవల్ ఆధారంగా ఆటోమేటిక్‌గా తెరుచుకునేలా షట్టర్లు అమర్చారు. అంతే కాదు నీటి లెవల్ తగ్గిన తర్వాత ఆటోమెటిక్‌గా షట్టర్లు మూసుకుపోయేలా నిర్మించారు. అయితే కుమ్మరికాలువ డ్రైను పొడవునా ఆక్వా సాగు చేసే రైతులకు ఏప్రిల్, మే నెలల్లో ఉప్పు నీరు అవసరం ఉంటుంది. ఆటోమేటిక్ షట్టర్ల కారణంగా వైనతేయ నది నుంచి ఉప్పు నీరు డ్రైనుకు వచ్చే అవకాశం లేక కొంతమంది ఆక్వా రైతులు ఆటోమేటిక్ షట్టర్లు మూసుకుపోకుండా కొబ్బరి చెట్లను అడ్డుగా పెట్టి ఉప్పు నీటి ప్రవాహాన్ని కుమ్మరికాలువలోకి మళ్లించుకున్నారు. దీంతో ఆటోమెటిక్ షట్టర్లు దెబ్బతిన్నాయి.

వేలాది ఎకరాలకు ముంపు ముప్పు

అయినవిల్లి మండలంలో ప్రారంభమైన కుమ్మరి కాలువ డ్రైను అమలాపురం టౌన్, అల్లవరం మండలాల్లో ప్రవహించి గోపాయిలంక వద్ద వైనతేయ నదిలో కలుస్తుంది. డ్రైను పొడవునా వేలాది ఎకరాల్లో వరి సాగు, ఆక్వా సాగు జరుగుతుంది. వరి, ఆక్వా నుంచి వస్తున్న ముంపు నీరు మైనర్, రెవెన్యూ డ్రైన్ల ద్వారా ప్రవహించి అవుట్ స్లూయిజ్ గుండా నదిలోకి చేరుతుంది. అయితే షట్టర్లు మరమ్మతులకు గురవ్వడంతో వైనతేయ నదిలోని నీరు ఎదురెక్కుతుంది. వరదలు వస్తున్న ప్రతిసారి అవుట్ స్లూయిజ్ గుండా వరద నీరు కుమ్మరికాలువలోకి ఎదురెక్కి వేలాది ఎకరాలను ముంచెత్తుంది. దీని ప్రభావంతో అల్లవరం మండలంలో బోడసకుర్రు, అల్లవరం, కోడూరుపాడు, అమలాపురం మండలంలో టౌన్, రూరల్ ప్రాంతంలో పేరూరు, కొంకాపల్లి, ఈదరపల్లి, జనుపెల్ల, నడిపూడి, అయినవిల్లి మండలాల్లో విలస, అయినవిల్లి, సిరిపల్లి, మడిపెల్ల గ్రామాల్లో వేలాది ఎకరాలు ముంపుబారిన పడుతున్నాయి.

వర్షాకాలం తరువాత మరమ్మతులు చేస్తాం

గోపాయిలంక వద్ద అవుట్‌ఫాల్ స్లూయిజ్‌కు కొత్త షట్టర్లు ఏర్పాటుచేసేందుకు రూ.80 లక్షలతో ప్రతిపాదనలు చేశాం. తక్షణ మరమ్మతుల కోసం రూ.9.94 లక్షలు మంజూరయ్యాయి. వర్షాకాలం అనంతరం మరమ్మత్తులు చేస్తాం.

– దుర్గానాయుడు, ఏఈ, హెడ్‌వర్క్స్, అమలాపురం

మూడేళ్లుగా పోరాటం చేస్తున్నాం

వరదలు వచ్చిన ప్రతిసారి అవుట్ స్లూయిజ్ గుండా వరద నీరు కుమ్మరికాలువలోకి ఎదురెక్కి బోడసకుర్రు పంచాయతీ పరిధిలో ఐదు కాలనీలను ముంచెత్తుంది. అవుట్ స్లూయిజ్‌కు కొత్త గేట్లు పెట్టాలని మూడేళ్లుగా పోరాటం చేస్తున్నాం. జిల్లా కలెక్టర్, డ్రైను, హెడ్‌వర్క్స్ అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది.

– రొక్కాల విజయలక్ష్మి, సర్పంచ్, బోడసకుర్రు

రూ.80 లక్షలతో అంచనాలు

గత ఆగస్టులో గోదావరికి వరదలు వచ్చినపుడు కలెక్టర్ మహేష్‌కుమార్ అవుట్ స్లూయిజ్‌ని అధికారులతో కలిసి పరిశీలించారు. అవుట్ స్లూయిజ్‌కి ఒక గేటు పూర్తిగా పాడైందని, అత్యవసరంగా మరమ్మతులు నిర్వహించాలని అధికారులు ఆయనకు వివరించారు. అంతేకాకుండా మిగిలిన ఎనిమిది షట్టర్లకు కాలం చెల్లడంతో వాటి స్థానంలో కొత్తవి అమర్చాలని హెడ్ వర్క్స్ అధికారులు, డ్రైన్ అధికారులు సూచించారు. కొత్త షట్టర్ల ఏర్పాటుకు రూ.80 లక్షలు ఖర్చవుతుందని అంచనాలు రూపొందించారు. అయితే అధికారులు చేసిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమైపోయాయి. అధికార యంత్రాంగం శాశ్వత పరిష్కారం దిశగా అడుగులేయకుండా కేవలం తాత్కాలిక మరమ్మతులకే నిధులు మంజూరు చేసినట్లుగా రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు. ఇప్పటికైనా నిధులు విడుదల చేసి కొత్త షట్టర్లు ఏర్పాటుచేస్తే కుమ్మరికాలువ పరిధిలో ముంపు బెడద తప్పుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

డీఈఓ ఆకస్మిక తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ కమలకుమారి

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి కమలకుమారి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచిగా, నాణ్యంగా ఉండాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పదో తరగతిలో లక్ష్యాన్ని ఎంచుకుని ఆ దిశగా ఇప్పటి నుంచి సన్నద్ధం కావాలన్నారు. ప్రతి రోజు సబ్జెక్టు వారీగా ప్లానింగ్ ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో సీఎంఓ బొరుసు సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి విశ్వరూప్ పరామర్శ

అమలాపురం టౌన్: గుండెకు స్టంట్లు వేయించుకుని హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న అమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వంటెద్దు వెంకన్నాయుడును మాజీ మంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షుడు పినిపే విశ్వరూప్ సోమవారం పరామర్శించారు. విశ్వరూప్‌తో పాటు జిల్లా బీజేపీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు కూడా నాయుడిని పరామర్శించి ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత



విద్యార్థులకు యూనిఫాం, మొక్కలు అందిస్తున్న సర్పంచ్ చిన్నవరాజు, దాత ఉమామహేశ్వరరావు

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తంలోని మధురపేట పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన మట్టపర్తి ఉమామహేశ్వరరావు సోమవారం యూనిఫాం, మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి చిన్నవరాజు, ఎస్ఎంసీ చైర్మన్ నాగాబత్తుల సత్యనారాయణ, గుత్తుల సుబ్రహ్మణ్యం, పోతుమూడి కొండబాబు, వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్లను బాగు చేయండి మహాప్రభో



వర్షాలొచ్చినపుడు అమలాపురం కురసాల వీధికి వెళ్లే రోడ్డు దుస్థితి



అధ్వాన్నంగా తయారైన అమలాపురం విద్యుత్ నగర్ రోడ్డు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో ఇటీవల సంభవించిన తుపాన్లు, భారీ వర్షాలతో పలు రోడ్లు ఛిద్రమయ్యాయి. కొన్ని రోడ్లయితే చినుకుపడితే చాలు చిన్న సైజు చెరువులను తలపిస్తున్నాయి. పట్టణంలో 216 జాతీయ రహదారిని ఆనుకుని కాలేజీ రోడ్డులో శ్రావణి ఆస్పత్రి భవనం పక్క నుంచి కురసాలవీధి వరకూ ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఆ రోడ్డుపై పడిన పెద్ద పెద్ద గోతుల్లో నీరు రోజుల తరబడి నిలిచిపోవడంతో వాహన చోదకులే కాకుండా పాదచారులు కూడా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అలాగే స్థానిక విద్యుత్‌నగర్ రోడ్డు సైతం అధ్వానంగా తయారైంది. స్థానిక కుంకాల సందు, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆంజనేయ స్వామి ఆలయం నుంచి పెట్రోలు బంక్‌ల వరకూ మెయిన్ రోడ్డులో అడుగు లోతు నీరు నిలిచిపోతోంది. కార్మిక నగర్, హౌసింగ్ బోర్డు కాలనీలో పలు రోడ్లు కూడా వర్షం కురిస్తే రోజంతా ముంపు నీటితో అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆయా రోడ్లను ఆధునీకరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

1వ తేదీనే దీపావళి జరుపుకోవాలి



విలేకర్లతో మాట్లాడుతున్న పంచాంగ కర్తలు

అమలాపురం టౌన్: అపరాహ్న అమావాస్యతో కూడిన ప్రదోష సమయాన నవంబర్ 1వ తేదీనే దీపావళి జరుపుకోవాలని అమలాపురంలో భారతీయ తెలుగు దృక్ గణిత పంచాంగకర్తల సమాఖ్య సభ్యులైన 47 మంది పండితులు స్పష్టం చేశారు. స్థానిక శుభగృహ సమావేశపు మందిరంలో సోమవారం ఉదయం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో పంచాంగకర్తలు పులిపాక చంద్రశేఖరశర్మ, ఉపద్రష్ట నాగాదిత్య, గొర్తి పట్టాభిశాస్త్రి, కారుపర్తి నాగ మల్లేశ్వరరావు, ఉపద్రష్ట విక్రమాదిత్య తదితర పంచాంగకర్తలు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దీపావళికి అక్టోబర్ 31న సెలవు దినం ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన దృక్ సిద్ధాంతం ప్రకారం నవంబర్ 1వ తేదీనే దీపావళిని జరుపుకోవాలని పలు పంచాంగాల్లో రాసిన విషయాన్ని గుర్తు చేశారు.

ప్రతిష్టాత్మకంగా కార్తికమాస మహోత్సవాలు



కార్తికమాసం ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వర స్వామివారి ఆలయంలో కార్తిక మాస మహోత్సవాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ఆలయంలో సోమవారం ఆయన స్థానిక అధికారులు, పురోహితులు, సిబ్బందితో కార్తిక మాసం ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం ఉండటంతో ఏర్పాట్ల గురించి చర్చించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేయడంతో పాటు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించనున్నట్లు తెలిపారు. పర్వదినాల్లో భక్తుల తాకిడి దృష్టిలో ఉంచుకొని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఈఓ సూచించారు. భక్తులు తిలకించేందుకు వీలుగా నెల రోజుల పాటు ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేస్తామన్నారు. నవంబర్ 15న రాత్రి పౌర్ణమి జ్వాలా తోరణం, ఆఖరి రోజు అమావాస్యకి దీపోత్సవం కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో దాట్ల రామకృష్ణంరాజు, పర్యవేక్షణాధికారి కఠారి శ్రీనివాసరాజు, అర్చకులు యనమండ్ర సుబ్బారావు, పేటేటి శ్యామలకుమార్, పురోహితులు నాగాభట్ల రామకృష్ణమూర్తి, వేదపండితులు గంటి సుబ్రహ్మణ్యశాస్త్రి, స్వస్తి వాచకులు నాగాభట్ల రవిశర్మలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అశోక్‌ను కలిసిన సబ్ రిజిస్ట్రార్



ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను సత్కరిస్తున్న సబ్ రిజిస్ట్రార్ నరేంద్రకుమార్

యానాం: ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్‌ను యానాం నూతన సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన పెట్ల నరేంద్రకుమార్ సోమవారం స్థానిక కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. పెండింగ్ రిజిస్టర్‌లో ఉన్న పనులు ఎలాంటి అవకతవకలు లేకుండా పూర్తి చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

శ్రీపీఠంలో గొల్లపల్లికి ఆశీర్వచనం

యానాం: దసరా శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా శ్రీపీఠంలో నిర్వహించిన శ్రీమహాశక్తి యాగం ముగింపు కార్యక్రమంలో యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామీజీ ఎమ్మెల్యే అశోక్‌ను ఆశీర్వదించారు. అనంతరం అశోక్‌ను దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

16న రామచంద్రపురంలో జాబ్‌మేళా

ముమ్మిడివరం: ఈ నెల 16న రామచంద్రపురంలో జిల్లా ఉపాధి కార్యాలయం, స్కిల్ డెవలప్‌మెంట్ వారి ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి వసంతలక్ష్మి తెలిపారు. రామచంద్రపురం గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో ఉదయం 10.30 గంటలకు ప్రముఖ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల యువతీయువకులు తమ సర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 82476 45389 సెల్ నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

వైభవంగా అమ్మవారి నిమజ్జన ఊరేగింపు



గాంధీనగర్ కనకదుర్గ అమ్మవారి నిమజ్జన ఊరేగింపు



కేరళ దప్పు వాయిద్యాలు

అమలాపురం రూరల్: దసరా శరన్నవరాత్ర మహోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక గాంధీనగర్‌లోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారి నిమజ్జన కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపులో పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. శక్తి వేషాలు, కోబ్రా డాన్స్‌లు, కేరళ వాయిద్యాలు, బుట్ట బొమ్మలు, యువకులు, చిన్నారుల నృత్యాలు వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు తిక్కిరెడ్డి ఆదినారాయణ ఆధ్వర్యంలో ఈ నిమజ్జన ఊరేగింపు జరిగింది.

జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

యానాం: ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ పుదుచ్చేరిలో జరిగిన జాతీయస్థాయి అత్యా, పత్యా పోటీల్లో శారదా విద్యానికేతన్ విద్యార్థిని చింతా శ్రీదుర్గాలక్ష్మీ షణ్ముఖప్రియ ప్రతిభ కనబరిచింది. పుదుచ్చేరి రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించి జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని షణ్ముఖప్రియతో పాటు ఆమెకు తర్ఫీదు నిచ్చిన పీడీ చింతా వెంకన్నలను హెచ్‌ఎం సీహెచ్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన



కొత్తలంకలో అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుబ్బరాజు

ముమ్మిడివరం: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో రూ.2.85 కోట్ల ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో 5.28 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు సోమవారం శంకుస్థాపన చేశారు. కొత్తలంకలో అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, తాడి నరసింహరావు, పొద్దోకు నారాయణరావు, అర్థాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణకుమార్, చిక్కాల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి జైలు శిక్ష

ఆలమూరు: మద్యం తాగి వాహనాన్ని నడిపిన లారీ డ్రైవర్ దాకారపు రమేష్‌బాబు (465)కు 15 రోజుల జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సోమవారం తీర్పును వెలువరించింది. స్థానిక ఎస్సై ఎం.అశోక్ కథనం ప్రకారం ఈనెల 8న జొన్నాడలో మద్యం తాగి వాహనాన్ని నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. దీనిపై కేసును నమోదు చేసిన స్థానిక పోలీసులు సోమవారం కోర్టులో హాజరుపర్చారు. ఈమేరకు ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు తుది తీర్పును వెలువరించారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- ప్రొటోకాల్ తప్పనిసరిగా పాటించాలి
- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు

అల్లవరం: మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. హౌసింగ్ ఏఈ శివ మాట్లాడుతూ 2019 ముందు 1487 గృహాలకు రుణాలు, పెండింగ్ బిల్లులు ఉన్నాయని చెప్పారు. దీనిపై సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, కడలి గంగాచలం మాట్లాడుతూ ఇలాంటి విషయాలను సర్పంచ్‌ల దృష్టికి తీసుకురావాలని మీకు తెలియదా అని ప్రశ్నించారు. మీరు టీడీపీ గ్రామ కమిటీకు పని చేయడానికి వచ్చారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక ముందు ఏం జరిగినా ప్రజాప్రతినిధులు దృష్టిలో పెట్టిన తర్వాతే పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మాట్లాడుతూ కొందరు అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, ప్రజల చేత ఎన్నుకోబడిన తమకు ఎలాంటి సమాచారం లేకుండానే పనులు కానిచ్చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు దానికి బదులిస్తూ అధికారులంతా ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని, అలాగే ప్రొటోకాల్ తప్పనిసరిగా పాటించాలని ఆదేశాలు జారీచేశారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రానున్న ఖరీఫ్ నుంచి రైతులు తాము పండించిన ధాన్యాన్ని వారి ఇష్టానుసారంగా అమ్ముకోవచ్చని ఏఓ ఎస్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. జేజేఎం రెండో దఫా పనులకు 29 హేబిటేషన్లలో పైపులైన్ నిర్మాణానికి పైపులు వచ్చాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వామి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం సరఫరా లేదని, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందడం లేదని ఎంపీటీసీ మాకే కృష్ణమూర్తి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో బియ్యం కొరతను వెంటనే నివారిస్తామన్నారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

గూడాల వీఆర్‌ఓ మోహన్‌రావు ప్రతి సర్టిఫికెట్‌కు డబ్బులు తీసుకుంటున్నారని సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు ఆరోపించారు. దీనిపై తహసీల్దార్ నరసింహరావు మాట్లాడుతూ రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ చేస్తామన్నారు. గూడాల పంచాయతీ పరిధిలో 96 కొబ్బరిచెట్లకు వేలం పాట నిర్వహించి పాటదారుడు చేటకాళ్ల రెడ్డి నుంచి రూ.47,000 తీసుకున్నారని చిరంజీవిరావు చెప్పారు. రెండు నెలలు గడిచినా తీర్మానం బుక్‌లో నమోదు చేయకపోవడమే కాక నిధులను ట్రెజరీలో సైతం జమ చేయని కార్యదర్శి చిక్కం శ్రీనుపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. టీడీపీ గ్రామ కమిటీ నాయకుడు చెప్పిన వ్యక్తికి కొబ్బరి చెట్లు వేలంపాటలో అప్పగించేలా కార్యదర్శి ప్రయత్నం చేశారని దీనిపై డీపీఓ, డీఎల్‌పీఓలకు ఫిర్యాదు చేశామన్నారు. పారదర్శకంగా విచారణ చేసి పాటదారుడికి న్యాయం చేయకపోతే కోర్టుని ఆశ్రయిస్తామని సర్పంచ్ చిరంజీవిరావు హెచ్చరించారు. దీనిపై సర్పంచ్, కార్యదర్శి చిక్కం శ్రీను మధ్య వాగ్వాదం జరిగింది. ఎంపీపీ శేషగిరిరావు స్పందిస్తూ ఈ విషయంపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని ఎంపీడీఓని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వడ్డి గంగ, ముత్యాల వెంకట రామకృష్ణ, ఎంపీటీసీలు గుబ్బల బాబ్జి, మౌనిక, మామిడిశెట్టి శ్రీను, పులుసుగంటి రాజేశ్వరి, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు సుందరనీడి సాయి, తిక్కిరెడ్డి శ్రీను, కొల్లు వెంకటరమణ, రొక్కాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.